కదిలొచ్చిన జనం



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

- ఎండను లెక్కచేయని వైనం
- గంటపాటు సాగిన చంద్రబాబు ప్రసంగం
- ఆసక్తిగా విన్న సభికులు
- వైసీపీ నేతల అవినీతిని ప్రస్తావించగానే కేకలతో స్పందన
- జీడీనెల్లూరులో 'రా కదలిరా' విజయవంతం

- పాపాల పెద్దిరెడ్డి ఇంట్లోనే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు, దొంగలు ఉన్నారు. ఇసుక, గ్రానైట్, ఎర్రచందనం అన్నీ దోచుకుంటున్నారు. శివశక్తి డెయిరీలో రైతులు తక్కువ ధరకే పాలు పోయాలంట.
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అవినీతిపరుడని ముద్ర వేసి టికెట్ ఇవ్వలేదు. మరి పెద్దిరెడ్డి, చెవిరెడ్డి అవినీతి పరులు కాదా?
- తన నియోజకవర్గంలో రోజుకు 200 ట్రాక్టర్ల ఇసుకను పెద్దిరెడ్డి మనుషులు అక్రమంగా రవాణా చేస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలమే చెప్పారు. స్కూటర్‌లో తిరిగే పెద్దిరెడ్డికి రూ.35 వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దమ్ముంటే వీటికి పెద్దిరెడ్డి సమాధానం చెప్పాలి. ఉమ్మడి జిల్లాలోని మూడు దళిత ఎమ్మెల్యే స్థానాలనూ వైసీపీ మార్చింది.
- మంత్రి రోజా మహిళల భద్రత గాలికొదిలేసి పొరుగు రాష్ట్రాల్లో చిందులేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తానని చెప్పి దళిత మహిళా కౌన్సిలరు వద్ద రూ.70 లక్షలు వసూలు చేశారు. నగరిలో నలుగురు ఎమ్మెల్యేలుండి వాటాలు వేసుకుని దోచుకుంటున్నారు.
- దొంగ ఓట్లకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చెవిరెడ్డి ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ప్రమోషన్ మీద వెళ్తున్నారంట. స్వర్ణముఖి నదిలో రోజుకు వందల ట్రక్కుల ఇసుకను దోచుకున్నారు. వీరప్పన్ తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేశారు.
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ గ్రానైట్‌లో ఎక్కడికక్కడ దోచేశారు. జనార్దన్ నాయుడి క్వారీ లాక్కుని కరెంటు బిల్లులు కూడా కట్టడం లేదు.
- ఇన్నాళ్లు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దోచుకున్నారు. ఇసుక మాఫియా ఆయనదే. కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి లేకుండా ఏమీ జరగడం లేదు. ఇప్పుడు ఇంటర్నేషనల్ ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి టికెట్ ఇచ్చారు. అయ్యప్ప లేఅవుట్‌లో కోట్ల డబ్బులు పోతే ఎవ్వరూ నోరు మెదపడం లేదు.
- రెడ్లు కూర్చొని ఉంటే పక్కన చేతులు కట్టుకుని జీ హుజూర్ అంటూ నిలబడే డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఓ అసమర్థుడు. దళితుల ఆత్మగౌరవాన్ని రెడ్ల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు.



చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'రా.. కదలిరా' అన్న టీడీపీ పిలుపునకు జనం స్పందించారు. గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె వద్ద మంగళవారం నిర్వహించిన చంద్రబాబు సభకు కదిలొచ్చారు. జిల్లా నలుమూలల నుంచీ టీడీపీ శ్రేణులూ తరలివచ్చారు. షెడ్యూల్ మేరకు మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు వస్తారని తెలిసినా ఉదయం 9 గంటల నుంచే సభా ప్రాంగణం నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారింది. 12 గంటలకంతా కార్యకర్తలు, మహిళలు, జనం పెద్దఎత్తున చేరుకున్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ లెక్కచేయలేదు. షెడ్యూల్ మేరకు చంద్రబాబు సభాప్రాంగణం సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. అప్పటికే వేదికపై టీడీపీ నాయకులు దొరబాబు, షాజహాన్, హేమలత, పీఎస్ మునిరత్నం, రాజన్, సప్తగిరి ప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్ తదితరులు ప్రసంగించారు. చంద్రబాబు వేదిక మీదకు వచ్చాక అమరనాథరెడ్డి, పులివర్తి నాని, డాక్టర్ థామస్ మాట్లాడారు. సాయంత్రం 4 నుంచి ఐదు గంటల వరకు.. సుమారు గంటపాటు చంద్రబాబు ప్రసంగం సాగింది. ఈ ప్రసంగాన్ని శ్రేణులు, మహిళలు ఆసక్తిగా విన్నారు. జిల్లా నాయకుల అవినీతి, అక్రమాల గురించి చంద్రబాబు చెప్పేటప్పుడు జనం కేకలతో ప్రతిస్పందించారు. థామస్‌ను గెలిపించాలని చంద్రబాబు కోరినప్పుడు సభికులు విశేషంగా స్పందించారు. సభా ప్రాంగణం నిండిపోయి పక్కనే ఉన్న పుత్తూరు- చిత్తూరు ప్రధాన రహదారి కూడా ప్రజలతో కిక్కిరిసింది. రామానాయుడుపల్లె వేదిక స్థలం నుంచి అటు జీడీనెల్లూరు వరకు ఇటు కొత్తపల్లిమిట్ట వరకు కార్యకర్తలు వచ్చిన వాహనాలు ఆగిపోయాయి. 5 గంటలకు చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యాక వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్ గాంధీ టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీకే ఆదికేశవులు కుమార్తె తేజస్విని వేదిక మీద చంద్రబాబును కలిశారు. 5.30 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్ బయల్దేరిన తర్వాత గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. నగరి, పూతలపట్టు ఇన్‌చార్జులు గాలి భానుప్రకాష్, మురళి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు. ఇక, చిత్తూరు నగర సమీప రాణా వద్ద గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో 15 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.



టీడీపీలో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే గాంధీ



జిల్లాకు ఏం చేస్తామంటే..!

హంద్రీనీవా కాలువ పూర్తి చేస్తాం. కృష్ణాపురం రిజర్వాయర్‌కి నీళ్లిస్తాం. ఎన్టీఆర్ జలాశయం ద్వారా జీడీనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీళ్లిచ్చి కరువు లేకుండా చేస్తాం. సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా నగరికి నీళ్లు తెస్తాం. జిల్లాలోని ప్రతి చెరువుకూ నీళ్లిస్తాం. పలమనేరులో టమోటా, మామిడి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. కైగల్ రిజర్వాయర్ నిర్మిస్తాం. నింద్రలో మూతపడిన నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం. నగరిలో చేనేత కార్మికుల్ని ఆదుకుంటాం. పొలాల్లో రైతులకు సోలార్ పంపు సెంట్లు ఏర్పాటుచేసి అదనపు ఆదాయం సంపాదించేలా ప్రణాళిక రూపొందిస్తాం' అని చంద్రబాబు హామీలిచ్చారు.

పుంగనూరులో బీసీవై పార్టీ గడియారాల సీజ్



తిమ్మికృష్ణాపురంలో గోడగడియారాలను లారీలోకి ఎక్కిస్తున్న పోలీసులు

- బిల్లులు చూపిన నేతలు.. పట్టించుకోని పోలీసులు

పుంగనూరు. ఫిబ్రవరి 6: పుంగనూరులోని రెండు చోట్ల బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌కు సంబంధించిన భారీ స్థాయిలో గోడ గడియారాలను పోలీసులు సీజ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసు బలగాలు మంగళవారం పుంగనూరుకు చేరుకున్నాయి. పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సెర్చ్ వారెంట్ ఉత్తర్వులతో ఏకకాలంలో రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. కొత్తయిండ్లులోని ఎల్ఐసీ కాలనీలో రామచంద్రయాదవ్ భద్రతా సిబ్బంది సీఆర్పీఎఫ్ పోలీసులున్న ఇంటికి స్థానిక పోలీసులు వెళ్లారు. తలుపులు కొట్టి తీయమని చెప్పగా.. సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు నిరాకరించారు. తమ వద్ద సెర్చ్ వారెంటు ఉందంటూ పుంగనూరు, పలమనేరు సీఐలు రాఘవరెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ సహదేవి హెచ్చరించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. ఇంటి చుట్టూ పోలీసులు మోహరించి, ప్రధాన మార్గం గుండా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. మీరు సహకరించకపోతే అరెస్ట్ చేస్తామని సీఐ రాఘవరెడ్డి చెప్పారు. ఆ తర్వాత లోపలకు వెళ్లిన పోలీసులు రామచంద్రయాదవ్ ఫొటో, చెరకు రైతు గుర్తుకే మన ఓటు అని ఉన్న గోడ గడియరాల బాక్సులను పరిశీలించారు. వీటిని వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8 గంటల వరకు పోలీసులు పంచనామా నిర్వహించారు. అదే సమయంలో మండలంలోని చదళ్ల సమీపం.. తిమ్మికృష్ణాపురంలో శివకుమార్ ఇంటి వద్ద చౌడేపల్లె, గంగవరం సీఐలు కృష్ణారెడ్డి, చిన్న గోవిందు, సదుం ఎస్ఐ మారుతి సోదాలు నిర్వహించారు. ఇంటి సమీపంలోని గదిలో ఉన్న గోడ గడియారాలను రెండు లారీల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, వీటిని వాహనాల్లోకి ఎక్కించడానికి కూలీలు లేకపోవడంతో పోలీసులే మోసుకెళ్లారు. చౌడేపల్లె సీఐ అయితే లారీ ఎక్కి బాక్సులను సర్ది పెట్టించారు. హైదరాబాదులో పద్మావతి సేల్స్ కార్పొరేషన్ నుంచి ఈ నెల 5వ తేదీ 6864 గోడగడియారాలు కొనుగోలు, జీఎస్టీ, ఇతరుల పన్నులు కలిపి రూ.5,26,469చెల్లించి పుంగనూరుకు తీసుకొచ్చినట్లు బీసీవై పార్టీ నేతలు పోలీసులకు బిల్లులను చూపారు. కాగా, ఓటర్లను ప్రభావితం చేసేందుకు గోడగడియారాలు తెప్పించారని పోలీసులు సోదాలు చేసేందుకు సెర్చ్ వారెంటు జారీ అయింది.



పుంగనూరులో పోలీసులు, సీఆర్పీఎఫ్ పోలీసుల మధ్య వాగ్వాదం

పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం..



మంత్రి పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం కొందరు పోలీసులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రామచంద్రయాదవ్ మీడియాకు వీడియో పంపారు. సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో పాల్గొన్న తమ పార్టీ కార్యకర్తలకు కిట్లు ఇవ్వడానికి రశీదులతో గోడగడియారాలు తెప్పిస్తే.. తప్పుడు ఆరోపణలతో వాటిని సీజ్ చేయడం దారుణమన్నారు. వీటిపై తాను న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.

రైతు వద్ద డబ్బు తీసుకుంటూ..

- ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్



పట్టుబడిన సొమ్ముతో జూనియర్ అసిస్టెంట్ జయరాం ఆచారి

విజయపురం, ఫిబ్రవరి 6: ఓ రైతు వద్ద రూ.13 వేలు తీసుకుంటూ మంగళవారం విజయపురం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయరాం ఆచారి ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అడంగలు, ఎఫ్ఎంబీ, వన్‌బీ కాపీల కోసం గంగమాంబాపురానికి చెందిన రైతు గాలి రమేశ్ నాయుడు దరఖాస్తు చేసుకున్నారు. ఇవ్వకపోవడంతో స్పందనలోనూ ఫిర్యాదు చేశారు. నగదు ఇస్తేనే కాపీలు ఇస్తామని డిమాండ్ చేశారంటూ ఏసీబీ అధికారులను ఆయన ఆశ్రయించారు. వారు సూచించిన ప్రకారం.. వ్యవసాయాధికారి కార్యాలయం పక్కన రూ.13 వేలను జూనియర్ అసిస్టెంటుకు ఇచ్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడులచేసి పట్టుకున్నారు. కార్యాలయంతో పాటు ఆయన ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. వివరాలను తహసీల్దార్ మల్లికార్జునరావ్ సమక్షంలో రికార్డు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే 1400, 1902 టోల్‌ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని ఏసీబీ అధికారులు కోరారు. కార్యక్రమంలో ఏసీబీ ఏఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, సీఐలు ఈశ్వర్, ఎల్వీనాయుడు, సునీల్‌కుమార్, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పనిచేస్తాయి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 6: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల బుధవారం యథావిధిగా పనిచేస్తాయని డీఈవో విజయేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అప్షనల్ లీవు లేదని పేర్కొన్నారు. 7న ఐచ్ఛిక సెలవు ప్రకటించినా, పాఠశాల పని దినాలు 220 పూర్తి చేయాలనే నిర్ణయంతో రద్దు చేసినట్లు తెలిపారు.

టీడీపీ నేతల మాట

జీడీనెల్లూరు: రామానాయుడు పల్లె వద్ద మంగళవారం జరిగిన రా కదలిరా సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు రాకముందు.. వచ్చాక పలువురు నేతలు ప్రసంగించారు. వీరిలో కొందరి ప్రసంగం వారి మాటల్లోనే..



వీళ్లా జిల్లాను అభివృద్ధి చేసేది

జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారు. అందులో ఒకడేమో పుంగనూరులో అక్రమ కేసులు పెడతాడు. మరో మహిళా మంత్రేమో పదవులు ఇప్పిస్తానని సొంత నాయకుల చేత డబ్బులు వసూలు చేస్తుంది. ఇక్కడున్న ఉపముఖ్యమంత్రి పొద్దున ఏమి మాట్లాడతాడో.. సాయంత్రం ఏమి మాట్లాడతాడో తెలియదు. ఇలాంటి వాళ్లా జిల్లాని అభివృద్ధి చేసేది.

- అమరనాథరెడ్డి, మాజీ మంత్రి



జిల్లాను దోచుకుంటున్నారు

జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి జగన్‌కు బినామీగా దోచిపెడుతున్నాడు. ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి చిత్తూరు అసెంబ్లీ ఇన్‌చార్జి ఇచ్చారు. చంద్రగిరిలో గంజాయి, ఎర్రచందనం, ఎర్రమట్టి, ఆస్తులు దోచుకుంటున్న వ్యక్తి చెవిరెడ్డి. వీరందరికీ ముఠా నాయకుడు పెద్దిరెడ్డి.

- పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు



కొండల్ని పిండి చేస్తున్నారు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు భూకబ్జాలు, కొండల్నీ పిండిచేసి ఆక్రమించేస్తున్నారు. నారాయణస్వామి ఓ పక్క ఎర్రచందనం దొంగని, మరో పక్క ఇసుక దొంగని పెట్టుకుని నియోజకవర్గాన్ని దోచేశారు. టీడీపీని గెలిపించండి. యువతకి ఉద్యోగం, పరిశ్రమలు తెప్పించే బాధ్యత నేను తీసుకుంటా.

- థామస్, జీడీనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి

ఎస్సీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి



ముఖ్యమంత్రి జగన్ నిరంతరం నా ఎస్సీలు, నా బీసీలు అని ప్రగల్భాలు పలుకుతుంటారు. మరి, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను, బీసీ సబ్సిడీ నిధులను పక్కదారి పట్టించింది నువ్వు కాదా? ఈ సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే జిల్లాలో అన్నీ అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలుపు ఖాయం అనిపిస్తుంది.

- మురళీమోహన్, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి



ఎన్ని కేసులు పెట్టినా భయపడం

ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి 15 కేసులు పెట్టాడు. మరో 150 పెట్టినా భయపడం. వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చలేని అసమర్థుడు. ఆయన్ను ఓడించి సీబీఐ ఎంక్వయిరీ వేసి లోపలవేస్తాం. ఖబడ్దార్.

- యుగంధర్, జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి







చిత్తూరు- పుత్తూరు రహదారిపై కిక్కిరిసిన జనం - సభలో తెలుగు మహిళల ఉత్సాహం - హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు వీడ్కోలు



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుతో గురజాల జగన్మోహన్

'పాచిగుంట' మృతి తీరని లోటు

జీడీనెల్లూరు: తెలుగురైతు రాష్ట్ర నేత, గంగాధరనెల్లూరు మండలం పాచిగుంటకు చెందిన పాచిగుంట మనోహర్‌నాయుడి మృతి పార్టీకి తీరని లోటని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయన మృతి తనను కలచి వేసిందన్నారు. వారి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. అనంతరం మనోహర్‌నాయుడు కుమార్తెలు రాధిక, శిల్ప, తమ్ముడు కుమారుడు రఘునాథనాయుడును తన వాహనం వద్దకు పిలిపించుకుని చంద్రబాబు మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.



మనోహర్ నాయుడి కుటుంబీకులతో చంద్రబాబు

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లాకు, 15 మందిని కడప జిల్లా నుంచి వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

కేటాయించిన మండలాలివీ..

- కడప జిల్లా నుంచి వచ్చిన 13 మందిలో సి.వెంకటేశు (చౌడేపల్లి), జి.రవికుమార్ రెడ్డి (నగరి), కె.వి.శ్రీధర్ నాయుడు (కార్వేటినగరం), టి.వెంగముని రెడ్డి (పుంగనూరు), పి.వరప్రసాద్ (సోమల), జె.సుజాతమ్మ (వడమాలపేట), ఎస్.నూర్జహాన్ (బి.కొత్తకోట), ఎ.జగదీశ్వర్ రెడ్డి (గుర్రంకొండ), జి.రెడ్డయ్య (కేవీపల్లి), సి.రామక్రిష్ణయ్య (కలికిరి), బి.మైథిలి (నిమ్మనపల్లి), సి. వెంకటరమణయ్య (పెద్దమండ్యం), జి.కృష్ణమూర్తి (తంబళ్లపల్లి) మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు.
- **నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన 17 మందిలో...** ఎన్ గోపి (గుడుపల్లి), ఎం.భవాని (నింద్ర), కె.వెంకటేశ్వరరావు (పెనుమూరు), కె.సురేష్ బాబు (పులిచెర్ల), బి.సింగయ్య (యాదమరి), పి.ప్రసన్నకుమారి (పూతలపట్టు), జి.వెంకటేశ్వర్లు (తవణంపల్లి), కె.గోవర్ధన్ (వి.కోట), ఎం.బ్రహ్మయ్య (విజయపురం), ఎం.భాస్కర్ (గంగాధరనెల్లూరు), కె.షాలెట్ (బి.ఎన్. కండ్రిగ), వి.వి.సూర్యసాయి (చంద్రగిరి), కె.వి.శివప్రసాద్ (కేవీబీ పురం), కె.నాగేంద్రబాబు (పాకాల), కె.ప్రత్యూష (రామచంద్రాపురం), పి. ఐజాక్ ప్రవీణ్ (తొట్టంబేడు), ఎం.మధుసూదనరావు (ఎర్రావారిపాళ్యం) మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇచ్చారు.

ఉద్యోగుల వివరాల సేకరణలో యంత్రాంగం



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాల సేకరణలో మూడ్రోజులుగా జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఉద్యోగుల పూర్తి డేటాను పంపాలని ఇటీవల ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆ మేరకు 34 అంశాలతో కూడిన ప్రొఫార్మాలో ఉన్నత స్థాయి అధికారి నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకు వివరాలతో కూడిన జాబితాను తయారు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్ పక్కన గల ఎన్ఐసీ వీడియోకాన్ఫరెన్స్ హాలులో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఉద్యోగుల సొంత జిల్లా, నియోజకవర్గం, మండల వివరాలు, సీఎఫ్ఎంఎస్ సంఖ్య, పేస్కేల్, బేసిక్ పే, గతంలో ఎన్నికల విధులకు హాజరైవుంటే ఆ వివరాలను సైతం జిల్లా అధికారుల నుంచి నమోదు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు, వారి సహాయకులతో కలిసి డేటా నమోదులో పాల్గొంటున్నారు. ఈ వివరాల సేకరణ పూర్తయ్యాక సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందని ఉద్యోగుల వివరాలు కూడా సేకరించనున్నారు. రెండుమూడు రోజుల్లో వివరాల సేకరణ పూర్తయిన తర్వాత నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరిట ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ అధికారపూర్వకంగా విడుదలయిన తర్వాత ఎన్నికల విధుల కోసం అవసరమైన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తారు. విధుల్లో తీసుకున్న ఉద్యోగుల్లో 20శాతం మందిని ఎన్నికల విధులకోసం రిజర్వులో ఉంచుతారు.

ముండ్రివారిపల్లె సమీపంలో జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 6: సోమల మండలంలో సంచరిస్తున్న జంట ఏనుగులు మంగళవారం ముండ్రివారిపల్లె సమీప వరిపొలాల్లో తొక్కుకుంటూ వెళ్లాయి. మల్లికార్జున, నెల్లిమంద బాషా పొలాల్లో పంటలను ధ్వంసం చేశాయి. వారం రోజులుగా మండల రైతులను జంట ఏనుగులు కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం రాత్రి గంగమ్మ గుడి వద్ద మామిడి తోటలో తిరగాడి డ్రిప్ పరికరాలను తొక్కి వేశాయి. అటవీ అధికారులు జంట ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖర్చుకు సిద్ధమా...?

'అహ నా పెళ్లంట సినిమాలో బ్రహ్మానందంలా ఉంది మా పరిస్థితి' అంటూ వాపోతున్నారు నగరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు. సీఎం జగన్ అనంతపురంలో నిర్వహించనున్న సిద్ధం సభకు తరలించాల్సిన జనసంఖ్య నియోజకవర్గాలవారీగా ఖరారైంది. 5నుంచి 10వేల మందిని నగరి నుంచి తరలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం నగరిలో వైసీపీ నాయకులతో మంత్రి రోజా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో స్థానిక నాయకుడు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి కనీసం 50 మందిని అనంతపురం సభకు తరలించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం మాత్రం పార్టీ ఏర్పాటు చేస్తుందని, సభకు వచ్చే వారికి అయ్యే ఖర్చులు ఆయా నాయకులే భరించుకోవాలని తేల్చి చెప్పేశారు.ఈ మాట వినగానే నాయకులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. 'అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్టిన ఖర్చులకు కనీసం వడ్డీకి సరిపడా కూడా సంపాదించుకోలేకపోయా' అని ఒక నాయకుడు వాపోయాడు. 'సరేలే భలే చెప్పావులే అన్నా.... కౌన్సిలర్ ఎలక్షన్లలో రూ.20 లక్షలు ఖర్చయింది. కనీసం వార్డులో డ్రైనేజీ నిర్మించే పని కూడా చేసుకోలేకపోయాను' అంటూ మరో కౌన్సిలర్ కం నాయకుడు నిట్టూర్చాడు. 'ఎక్కడో అనంతపురానికి అధినేత వస్తే మనం ఖర్చులు భరించి, జనాన్ని తీసుకువెళ్లడం ఏమిటి? పెద్ద నాయకుల పుట్టినరోజులు వస్తే వార్డుల్లో, గ్రామాల్లో వేలకు వేలు ఖర్చులు పెట్టి ఫ్లెక్సీలు కట్టాలి... నియోజకవర్గంలో మీటింగ్ అంటే జనాన్ని తోలాలి... పల్లెనిద్ర, గడప గడపకు అంటే రూ.లక్షలు ఖర్చు. ఎందుకు జగనే కావాలి అనే కార్యక్రమానికైతే చేతి చమురు వదిలింది. వడ్డీలు కట్టుకోవడం తప్ప రూపాయి సంపాదన లేదు.' అని చేతి చిల్లు వదిలిన మరొకరు భోరుమన్నారు. మంత్రి ముందు నోరెత్తకపోయినా ఒకరికొకరు మాత్రం తమ కష్టాలు కడుపుచించుకుని పంచుకున్నారు.



-పుత్తూరు అర్బన్

14న ఉద్యమానికి సిద్ధం



సంఘీభావం ప్రకటిస్తున్న ఎన్జీవో నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 6 : ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే ఈనెల 14న ఉద్యమానికి సిద్ధం కావాలని ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాఘవులు తెలిపారు. మంగళవారం పశు సంవర్థక శాఖ కార్యాలయంలో ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఏ, పీఆర్సీ, బకాయిలు చెల్లించకపోగా సరెండర్ లీవుల మొత్తాన్ని కూడా మూడేళ్లుగా సమర్పించలేదన్నారు. నూతన పీఆర్సీ కమిటీని ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. నిర్దేశిత గడువు పూర్తయిన నేపథ్యంలో 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో ఏపీఎన్జీవో, ఏపీ జేఏసీల రాష్ట్ర స్థాయి కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. అభివాదంలో ఏపీ ఎన్జీవో కార్యదర్శి రఘు, ఎన్‌పీ ప్రసాద్, నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవులుగా నమోదు చేయమంటే దౌర్జన్యం


చిత్తూరు, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో క్రైస్తవులుగా నమోదు చేయమంటే దౌర్జన్యం చేశారని చౌడేపల్లె మండలం పక్షిరాజపురం గ్రామానికి చెందిన క్రైస్తవులు ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడానికి పలువురు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తాము ఎస్టీ నక్కల కులానికి చెందిన వారమని, 30ఏళ్ల క్రితమే తమ పూర్వీకులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారని తెలిపారు. వలంటీర్ కులగణన సర్వేకు వచ్చిన సమయంలో తమను క్రైస్తవులుగా నమోదు చేయమని కోరగా, అంగీకరించలేదన్నారు. మేం చెప్పినట్లు వినకుంటే ఆధార్, రేషన్‌కార్డులను రద్దు చేస్తామని బెదిరింపులకు దిగడమే కాకుండా దౌర్జన్యం చేశారని ఆరోపించారు. న్యాయం కోసం కలెక్టరేట్‌కు వచ్చామన్నారు. వీరికి పాస్టర్ల సంఘం రాయలసీమ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ రాబర్ట్ మద్దతు పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని అధికారులకు వినతిపత్రం అందచేశారు.



కలెక్టరేట్‌కు వచ్చిన పక్షిరాజపురం ఎస్టీలు

వెంకన్న హుండీకి మరో టోకరా

తిరుపతి టౌన్ బ్యాంకులో రూ.10కోట్లు డిపాజిట్ చేసిన టీటీడీ



శ్రీవారి నిధులను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో డిపాజిట్ల రూపంలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రూ.10 కోట్లను గుట్టుచప్పుడుకాకుండా టీటీడీ డిపాజిట్ చేసింది.రెండు రోజుల క్రితం టీటీడీ ఖజానా నుంచి 13నెలలకు తిరుపతి టౌన్ బ్యాంకుకు నిధులు డిపాజిట్ చేసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన డిపాజిట్ బాండ్లను కూడా టీటీడీకి టౌన్‌బ్యాంకు అందజేసినట్టు సమాచారం. టీటీడీ నియమ నిబంధనల మేరకు మిగులు మొత్తాలను ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకులో మాత్రమే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రైవేట్ రంగ బ్యాంకులు కొటేషన్లు సమర్పించే అర్హత పొందడానికి అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగివుండాలి. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టకూడదని టీటీడీ పాలకమండలి ఇదివరకే తీర్మానించింది. 2022లో టీటీడీ విడుదలచేసిన శ్వేతపత్రం మేరకు దాదాపు రూ.1600 కోట్లు నగదు రూపంలో వివిధ జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో వున్నాయి. డిపాజిట్ చేయదలుచుకున్న జాతీయ బ్యాంకు ఎంత వడ్డీ ఇస్తుందో తెలియజేస్తూ సీల్డుకవర్‌లో కొటేషన్ పంపాలి. టీటీడీ ట్రస్టు అనుమతితో అధిక వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. టీటీడీ ఇప్పటివరకు ఎస్బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, విజయ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్టు తెలిసింది. అయితే పాలకమండలి ముఖ్యనేత నోటి మాట చెప్పారని రూ.10కోట్లు ఒక్క క్లిక్‌తో టౌన్‌బ్యాంకులో డిపాజిట్ చేసేశారు. రూ50 కోట్లు అడిగితే తొలివిడతగా 8.5 శాతం వడ్డీ రేటుతో రూ.10కోట్లు జమచేశారు. ఇప్పటివరకు సహకార బ్యాంకుల్లో శ్రీవారి నిధులు డిపాజిట్ చేసిన దాఖలాల్లేవు. ఎన్నికలవేళ నగరంలో మహిళలకు భారీగా రుణాలు ఇచ్చేందుకే ఈ నిధులు వినియోగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఏడాది కాబట్టి రుణగ్రహీతలు తిరిగి చెల్లించకపోతే టౌన్‌బ్యాంకుపై భారం పడకతప్పదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టౌన్‌బ్యాంకు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త పాలకమండలి వచ్చిన తర్వాత దాదాపు రూ.15కోట్లు డిపాజిట్‌దారులు వెనక్కి తీసుకున్నట్టు సమాచారం.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

అవకాశమిస్తే పలమనేరు నుంచి పోటీ చేస్తా

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: పలమనేరు అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అధిష్ఠానం అవకాశం ఇస్తే పోటీచేస్తానని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడను మార్చాలని, ఆయన స్థానంలో పోటీ చేయాలని అధిష్ఠానం నిర్ణయిస్తే కట్టుబడి ఉంటానన్నారు. తన అభ్యర్థిత్వానికి పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధ, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ రెడ్డి, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం ఎంపీపీలు రెడ్డెప్ప, రెడ్డెప్ప, శ్రీదేవి, మురళీమోహన్ రెడ్డి తదితరులు మద్దతు ఇస్తున్నారన్నారు. పలమనేరు స్థానానికి పోటీచేసే విషయమై అంతకుముందు ఆయన తన చాంబరులో అనుచరులతో మంతనాలు చేశారు.

ఆర్టీసీ బస్సు బోల్తా : 27 మందికి గాయాలు





బోల్తా పడ్డ బస్సు - గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వెళుతోంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం సర్కిల్ - రామానుజపల్లె సర్కిల్‌కు మధ్య జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా టిప్పర్ వచ్చింది. దీంతో వాహనాన్ని బస్సు డ్రైవర్ అదుపు చేయబోతుండగా రోడ్డుపక్కకు బోల్తా పడింది. బస్సులో 42మంది ప్రయాణికులు ఉండగా, 27మందికి గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మాత్రం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు (భార్యభర్తలు, ముగ్గురు చిన్నారులు)ఉన్నారు. స్వల్ప గాయాలైన వారంతా మంగళవారమే డిశ్చార్జ్ కాగా, ఐదుగురు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

రా..కదిలిరా సభకు తరలిన పసుపు దళం



శాంతిపురం, ఫిబ్రవరి 6: జీడీనెల్లూరులో జరిగిన రా..కదిలిరా సభకు శాంతిపురం నుంచి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, ప్రధానకార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి వారు ఊరేగింపుగా ఎన్టీయార్ సర్కిల్‌కు చేరుకుని ఎన్టీయార్‌కు నివాలులర్పించారు. అనంతరం జీడీనెల్లూరుకు పయనమయ్యారు. వెళ్లిన వారిలో నేతలు విజయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, నారాయణరెడ్డి, ఆర్ఎస్‌మణీ, ఉయ్యాల జయరామిరెడ్డి, సింగిరి శ్రీనివాసులు, రమేష్, రుద్రప్ప తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడికి మాజీ మంత్రి అమర్ నివాళి



పలమనేరు, ఫిబ్రవరి6 : పలమనేరు మండలం సముద్రపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడు అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు బాలాజీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు నాగరాజరెడ్డి, చలపతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ ఆర్థికసాయం



స్వరకంఠప్ప కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

రామకుప్పం, ఫిబ్రవరి 6: రామకుప్పం మండలం అయ్యప్పగానిపల్లె, కృష్ణరాజపురం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు స్వరకంఠప్ప, సుందరరావులు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు వెంకటరమణ, సురేష్, శంకరప్ప, జ్ఞానశేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భానుమూర్తి తదితరులు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలకు వారు పార్టీ తరఫున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

నిత్యావసర సరుకుల వాహనాన్ని పంపాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పలమనేరు, ఫిబ్రవరి6 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో కురప్పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ వాసులకు రేషన్ పంపిణీ వాహనాన్ని పంపాలని పలమనేరు మున్సిపల్ కౌన్సిలర్లు తహసీల్దార్ రంగ నాయకులను కలిసి విజ్ఞప్తి చేశారు. జగనన్నకాలనీలో 2500 మందికి పైగా ఇళ్ల మంజూరు చేశారని తెలిపారు. నిరుపేదలైన వీరు చౌకబియ్యం కోసం పట్టణానికి వెళ్లి గతంలో వారు నివాసమున్న స్థలాల్లో వేచి ఉండి బియ్యం, కందిపప్పు, రాగుల తదితర వస్తువులు తెచ్చుకోవలసి వస్తోందని తెలియజేశారు. అందువల్ల ఎండీయూ వాహనాన్ని స్థానికంగానే నిత్యావసరాలు అందించాలని కోరారు.

రా..కదలిరా సభకు బైరెడ్డిపల్లె నాయకులు



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 : గంగాధరనెల్లూరులో మంగళ వారం జరిగిన రా..కదలిరా సభకు బైరెడ్డిపల్లె మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వివిధ పంచాయతీల నుంచి పలు వాహనాల్లో వెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, నాయకులు అమరనాథరెడ్డి, భువనచంద్రగౌడు, గోవిందస్వామి, రమేష్, రాజేష్, జయచంద్రప్రకాష్ తదితరుల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం



వి.కోట నుంచి బయలుదేరిన నేతలు

వి.కోట, ఫిబ్రవరి 6: వచ్చే ఎన్నికలో టీడీపీ విజయ దుందుభి మోగిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు రంగ నాథ్ అన్నారు. మంగళవారం వి.కోట మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మండలంలోని నాయకులు, కార్యకర్తలు గంగాధరనెల్లూరులో జరిగిన రా..కదలిరా సభకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధికార ప్రతినిధులు రాంబాబు, చౌడప్ప, నేతలు నాగభూషణం, ధీరజ్, శబరీష్, చంద్రరెడ్డి, విశ్వనాథ్, భక్తా, గుణ, హరి, రామూర్తి, కృష్ణప్ప, నారా యణస్వామి, సతీష్ నాసీర్, షేక్ ఉమ్మర్, కోదండరెడ్డి, హరినాథ్ ఉన్నారు.

కుప్పం రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా రాజసింహా



రామకుప్పం, ఫిబ్రవరి 6: కుప్పం రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా రామకుప్పంకు చెందిన బీజేపీ నేత రాజసింహా నియమితులయ్యారు. ఈ మేరకు బెంగళూరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ నియామక పత్రాలను రాజసింహకు పంపారు.

దుకాణ దారులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 6: దుకాణ దారులు తప్పని సరిగారిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకారరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1988 దుకాణం, సంస్థల చట్ట ప్రకారం సొంత వ్యాపారం కలిగిన దుకాణలు, సంస్థలు, హోటళ్లు, సినిమా హాళ్ల అందరు విధిగా జిల్లా కార్మిక శాఖ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను తప్పని సరిగా పొంది ఉండాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఈ నెల 29వ తేది లోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం సహాయ కార్మిక శాఖ అధికారి జగదీష్‌బాబు మాట్లాడుతూ గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తప్పకుండా చేయించుకోవాలని, లేదంటే తనిఖీ చేసినప్పుడు రిజిస్ట్రేషన్ లేకుండా, రెన్యూవల్ లేకుండా దొరికితే కార్మిక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు బోయకొండలో వేలంపాటలు

చౌడేపల్లె, ఫ్రిబవరి6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో వివిధ వ్యాపారాల నిర్వహణకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రమౌళి వెల్లడించారు. కొబ్బరికాయలు, పూజ సామాగ్రి, పూలహారాలు, నిమ్మకాయల హారాలు, వడిబాల సామాగ్రి, వాహనాల టోల్‌గేటు నిర్వహణ, పెద్దభోగం, చిన్నభోగం సేకరించుట, తలనీలాల సేకరణ, క్లాక్ రూము నిర్వహణ, చీరలు, రవికలు, పావడాల సేకరణకు వేలం నిర్వహిస్తామని వివరించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, ఫిబ్రవరి 6: కుప్పం మండలం పరమసముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళా శాలల్లో(బాలికలు) 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర తరగతుల్లో (2024-2025) ప్రవేశానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.మల్లేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం 2024-2025 సంవత్సరం 4వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం కోసం 10వ తరగతి చదువుతుండాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరుగుతుందని తెలియజేశారు. వివరాలకు 9959888586 అనే ఫోన్ నెంబర్‌లో తనను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గుడుపల్లె, ఫిబ్రవరి 6: గుడుపల్లె తహసీల్దార్‌గా సయ్యద్ సహబుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, నాయకులు ఆయన్ను సన్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న గుర్రప్ప కర్నూలుకు బదిలీ కాగా అనంతపురం జిల్లా సీకేపల్లె నుంచి సయ్యద్ సహబుద్దీన్ వచ్చారు.

జాతీయ స్థాయి కవితల పోటీ

పలమనేరు, ఫిబ్రవరి6 : రానున్న భాషాదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు తెలిపారు. తెలుగుభాష, సంస్కృతులకు సంబంధించి 25 పంక్తులు మించకుండా కవితలు, గేయాలు, పద్యాలు, ఏవైనా రాసి ఈ నెల 15వతేది లోపు పి.తులసినాథంనాయుడు, కళామందిరం, గంగవరం, పలమనేరు, అనే చిరునామాకు ప్రభుత్వ తపాలా ద్వారా మాత్రమే పంపాలని కోరారు. బాగా రాసిన 40 మంది కవులకు పలమనేరు కళామందిరంలో సత్కారం చేస్తామని వెల్లడించారు.

జీడీ నెల్లూరుకు తరలిన టీడీపీ శ్రేణులు



కుప్పం, ఫిబ్రవరి 6: జిల్లాలోని జీడీ నెల్లూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరుగనున్న 'రా కదలిరా' భారీ బహిరంగ సభకు కుప్పం నుంచి టీడీపీ శ్రేణులు బుధవారం పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాయి. కుప్పం పురపాలక సంఘం పరిధిలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ మండలంలో ఆ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో భారీగా తరలి వెళ్లాయి.

పలమనేరు నుంచి తరలిన తెలుగుతమ్ముళ్లు



పలమనేరు, ఫిబ్రవరి6 : గంగాధరనెల్లూరులో మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు పాల్గొనే రా కదలిరా బహిరంగ సభకు పలమనేరు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. సుమారు 300 కార్లు, 25 బస్సులలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

ట్యాబ్‌లతో బాలికల పరీక్షలు

పలమనేరు, ఫిబ్రవరి6 : పలమనేరు బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ట్యాబ్‌ల అసెస్మెంట్ టెస్టును విద్యార్థినులకు నిర్వహించారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో రెండు పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో పలమనేరు బాలికోన్నత పాఠశాల ఒకటి, మంగళవారం పాఠశాలలోని 136 మంది విద్యార్థినులకు బైజూస్ కంటెంట్‌పై పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను దిద్దడం కూడా ఆన్‌లైన్‌లోనే చేస్తామని అధికారులు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణ పరిశీలకులుగా డిస్టిక్ నోడల్ ఆఫీసర్ సుధాకర్, ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం , ప్రధానోపాధ్యాయులు లత, ఎంఆర్‌సీ సిబ్బంది గిరిధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్‌లో విజేతలు

పలమనేరు, ఫిబ్రవరి6 : ఆర్టీసీలో ఆక్యుపెన్సీని పెంచేందుకు పలమనేరు డిపో అధికారులు ఈ నెల 5వ తేదీ చౌడేపల్లి రూట్‌లో నడిచే బస్సులలో గిఫ్టుబాక్సు ఏర్పాటు చేశారు. ఆ బాక్సులో వేసిన టికెట్లు సేకరించి మంగళ వారం డిపో మేనేజర్ చేతుల మీదుగా లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో ఆర్.సుహాసిని, ఆర్.శంకరరెడ్డి, యస్.జమారుద్దీన్ బహుమతులకు ఎంపికైనట్లు వివరించారు.

పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయం : చల్లా



చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న యువత

పుంగనూరు, ఫిబ్రవరి6: రానున్న ఎన్నికల్లో పుంగనూరులో టీడీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని చింతలవీధి, కట్టకింద పాళ్యం, కుమ్మరవీధి బజారువీధి తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కట్టకింద పాళ్యం, చింతలవీధికి చెందిన యువత పెద్దసంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల బెదిరింపులు, అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. రానున్న ఎన్నికలల్లో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, ఆసూరి బాలజీ, సుబ్రహ్మణ్యం రాజు, సుహేల్‌బాషా, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, దేశాది ప్రకాశ్, శ్రీనివాసులు, మాధవరెడ్డి, ప్రసాద్, సద్దాంహుస్సేన్, నౌషాద్, రామయ్య, శమిపతి, రాఘవ, సుధాకర్, జనసేన నాయకులు చిన్నారాయల్, నరేష్ రాయల్, విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, పాముల హరి తదితరులు పాల్గొన్నారు.

చీటీల మోసకారిని అరెస్ట్ చేయాలి



ధర్నా చేస్తున్న బాధితులు, మానవ హక్కుల సంఘం నాయకులు

గంగవరం, ఫిబ్రవరి 6: చీటీల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి ఉడాయించిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు డీవీ. మునిరత్నం కోరారు. మంగళవారం బాధితులతో కలసి ఆ సంఘ నాయకులు గంగవరం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నలసానిపల్లె గ్రామానికి చెందిన శంకర్ కొంతకాలంగా లైసెన్సులేని చీటీలను నిర్వహిస్తూ ప్రజల నుంచి రూ.10 లక్షలు, రూ.5 లక్షల చొప్పున వసూలు చేశారన్నారు. సుమారు రూ.7 కోట్ల వరకు వసూలు చేసి రాత్రికి రాత్రే ఉడాయించాడన్నారు. ఈ క్రమంలో డబ్బులు చెల్లిస్తామని కుటుంబసభ్యులు హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం నగదు చెల్లించాలని కోరితే సమాధానం చెప్పడం లేదని వాపోయారు. పోలీసులు శంకర్‌ను అరెస్ట్ చేసి బాధితులకు నగదు అందించాలని కోరారు. అనంతరం సీఐ చిన్నగోవిందుకు వినతిపత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సంఘ నాయకులు వేలాయుధం, పార్థసారధి పాల్గొన్నారు.

జిల్లాలో అన్ని స్థానాలు టీడీపీ-జనసేన కూటమివే



జీడీనెల్లూరుకు తరలిన టీడీపీ శ్రేణులు

రామకుప్పం, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంటు స్థానంతో బాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ-జనసేన కూటమి కైవసం చేసుకుంటుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణలు ధీమా వ్యక్తం చేశారు. జీడీనెల్లూరులో జరిగిన రా..కదిలిరా సభకు రామకుప్పం నుంచి వారితో బాటూ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యాధికారి విజయచందర్

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 : వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలు తగ్గించడం, ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు, జననీసురక్ష యోజన ఆవశ్యకత, పల్స్‌పోలియో తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సీహెచ్‌వో అనురాధ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన పీఈఎస్ విద్యార్థులు

కుప్పం, ఫిబ్రవరి 6: వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ విడుదల చేసిన మొదటి సంవత్సరంలో ఎంబీబీఎస్ పరీక్ష ఫలితాల్లో కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు తెలిపారు. మొత్తం 150 మంది విద్యార్థులకు గాను 143 (95.33 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. మొత్తం 15 డిస్టింక్షన్లు, 89 ఫస్ట్ క్లాస్‌లు, మరో 89 సెకండ్ క్లాస్‌లు సాధించినట్లు పేర్కొన్నారు. ఆస్తా గోల్ 84.11 శాతం, పి.ధార్మిక శ్రేష్ఠ 82.72, పలనాటి శ్రీ దీప్తి 80.67, అల్లంశెట్టి లక్ష్మి బాలాజీ 79.56, కురువ శ్రీవాణి 79.33, ఎల్.కార్తికేశ 78 శాతం మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దొరస్వామినాయుడు అభినందించారు.

మంచి నాయకులనే ఎన్నుకోండి



ముసలిమడుగులో నిర్వహించిన ర్యాలీ

పలమనేరు, ఫిబ్రవరి6 : పెంగరగుంట పంచాయితీ ముసలి మడుగు గ్రామంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంచి నాయకులను ఎన్నుకొని, మంచి సమాజాన్ని నిర్మించు కోవాలని కోరారు. సీసీ విజయకుమారి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించండి



బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 : మండలంలోని బేలుపల్లె గ్రామ సమీపంలో శిథిలావస్థలో వున్న పురాతన వేణుగోపాలస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిదులు, అధికారులు, దాతలు సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్నోయేళ్లుగా శిథిలావస్థలో వున్న ఈ ఆలయాన్ని పునర్నిర్మించడానికి బేలుపల్లె పరిరక్షణ సమితి సభ్యుల సహకారంతో ప్రత్యేకశ్రద్ధ తీసుకుం టున్నట్లు తెలియజేశారు. ఇప్పటికీ ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బృందావనం చెక్కుచెదరకుండా ఆకర్షణీయంగా ఉందని, చోళరాజుల కాలంలో నిర్మించిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి దాతలు సహకరించాలని గ్రామస్తులు తెలిపారు.

సైన్స్ ఫెయిర్‌లో కేఈసీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 6: ఆగసియా ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సినాప్సిస్ కంపెనీలు సంయుక్తంగా నిర్వహించిన అన్వేషణ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరి చినట్లు బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ తెలిపారు. పలమనేరులోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ దాకా ఈ సైన్స్ ఫెయిర్ జరిగిందన్నారు. ఇందులో 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ డివైస్ ఫర్ సాయిల్ మొయిచుర్ ప్రిడిక్షన్ ఇన్ అగ్రికల్చర్' అనే నమూనా జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే 'ఇన్ డోర్ ఎయిర్ మానిటరింగ్ అండ్ అలెర్ట్' అనే నమూనా జిల్లా స్థాయిలో నాల్గవ స్థానంలో నిలిచింది. ఈ రెండు నమూనాలు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికయ్యాయి. అలాగే 'అనిమల్ రేపెలెంట్ ఫర్ ఫార్మర్స్' అనే నమూనా కన్సొలేషన్ బహుమతి దక్కించుకుంది. గెలుపొందిన విద్యార్థులను, వారికి సహకరించిన అధ్యాపకులను మంగళవారం కేఈసీలో జరిగిన ఒక కార్యక్రమంలో బీసీ.నాగరాజ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డీ డైరెక్టర్ జీఎస్.కోదండరామయ్యా, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం

సోమల, ఫిబ్రవరి 6: సోమల ఎంపీడీవోగా వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన వైఎస్సార్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.



ఎంపీడీవో వెంకటేష్

చౌడేపల్లె: చౌడేపల్లె ఎంపీడీవోగా డాక్టర్ వెంకటేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పులివెందుల నుంచి బదిలీపై వచ్చారు. పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంపీడీవో మునిరెడ్డి

పుంగనూరు రూరల్: పుంగనూరు ఎంపీడీవోగా వెంగమునిరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోను ఎంపీపీ భాస్కర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.



ఏఈ నవీన్‌కుమార్

వి.కోట: వి.కోట ఎంపీడీవోగా గోవర్ధన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా కలువాయి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో మహ్మద్ రఫీ బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

విద్యుత్ ఏఈ బాధ్యతల స్వీకరణ



ఏఈ నవీన్‌కుమార్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి6: పుంగనూరు రూరల్ విద్యుత్ ఏఈగా నవీన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీరుగా పనిచేస్తున్న నవీన్‌కుమార్‌కు ఏఈగా పదోన్నతి కల్పించారు. మండలంలోని మంగళం, ఏటవాకిలి, బండ్లపల్లె, వనమలదిన్నె పంచాయతీల బాధ్యతలు చూసుకోనున్నారు. ఏడీఈ రవికుమార్, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉద్యమం ఆపేది లేదు



రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి6: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యాక్ట్ 27ను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు. స్థానిక కోర్టు సమీపంలోని మినీ బైపాస్‌రోడ్డుపై రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌తో పేదల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చార్లెస్, వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి6: ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు టి. జనార్దన్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను ఇష్టారాజ్యంగా పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు.

పింఛన్ల పంపిణీ



పుంగనూరు , ఫిబ్రవరి6: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. ● మున్సిపల్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్లు పించన్లు పంపిణీ చేశారు.

సదుం: మండల పరిధిలో నూతనంగా 53 మందికి పించన్లు మంజూరైనట్లు ఎంపీడీవో వరప్రసాద్, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వీరందరికీ ఫిబ్రవరి నెల పించను మొత్తాన్ని అందజేసినట్లు వివరించారు.

స్టడీ మెటీరియల్ వితరణ



సోమల, ఫిబ్రవరి 6: కందూరు హైస్కూల్లో పదో తరగతి చదువున్న 80 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను దాతలు పగడాల లక్ష్మీపతి, నీరజ దంపతులు అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రమణారెడ్డి, షకీల్, వాసుదేవ, శివరాజ, హరినారాయణ పాల్గొన్నారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం: చంద్రబాబు





రా.. కదలిరా సభలో జనాలకు జీడీనెల్లూరు ఇన్‌చార్జి థామస్‌ను పరిచయం చేస్తున్న చంద్రబాబు నాయుడు, సభావేదిక వద్దకు తోసుకువస్తున్న సభికులు

- రామానాయుడుపల్లి రా.. కదలిరా సభలో కిక్కిరిసిన టీడీపీ శ్రేణులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వం సిద్ధం అని బోర్డులు ఏర్పాటు చేశారు. దేనికి సిద్ధమో జగన్ చెప్పాలని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. మంగళవారం జీడీనెల్లూరు మండలం రామానాయుడుపల్లి వద్ద జరిగిన రా.. కదలిరా బహిరంగసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ ఇవ్వనందుకు సిద్ధమా, సీపీఎస్ రద్దు చేయనందుకు సిద్ధమా, రాజధానిని నిర్వీర్యం చేసినందుకు సిద్ధమా, మద్యపాన నిషేధం చేస్తానని చేయనందుకు సిద్ధమా లేక జాబ్ క్యాలెండర్ ఇవ్వనందుకు సిద్ధమా... దేనికి సిద్ధమో జగన్ చెప్పాలన్నారు. ఇవేమీ చేయనందుకు ప్రజలు వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు హెచ్చరించారు.

● జీడీనెల్లూరులో థామస్‌ను గెలిపించండి

మీ మధ్య నుంచి సామాన్యుడిగా వచ్చి వంద దేశాల్లో తిరిగి టెస్ట్‌ట్యూబ్‌పై పరిశోధనలు చేసి నిపుణుడిగా తయారయ్యారు. అందుకే పిలిచి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించా. నియోజకవర్గంలో బాగా తిరిగి పార్టీని బలోపేతం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అసమర్థ నాయకుడు నారాయణస్వామిని కాకుండా థామస్‌ను గెలిపించండి అని చంద్రబాబు కోరారు.

● ఉదయం నుంచే నేతల తాకిడి

రా..కదలిరా బహిరంగసభకు మంగళవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ ముఖ్యనేతల తాకిడి పెరిగింది. దీంతో చిత్తూరు - పుత్తూరు రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చంద్రబాబును చూసేందుకు కార్యకర్తలు బహిరంగసభలో ఫ్లడ్‌లైట్లకోసం ఏర్పాటుచేసిన ఐరన్‌స్టాండ్‌లపైకి, కటౌట్‌ల ఏర్పాటుకు కట్టిన కొయ్యలపైకి ఎక్కారు. ఈసందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటాలు సభకు విచ్చేసిన వారిని అలరించాయి. మహిళలు టీడీపీ జెండాలు చేతబట్టి సభా ప్రాంగణంతో పాటు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కాగా తెలుగుతమ్ముళ్లు బైక్ ర్యాలీలతో హోరెత్తించారు. సభలో మరో 500 మంది జనం ఎండతీవ్రతకు భయపడి షామియానా నీడలో కూర్చొని అధినేత ప్రసంగాన్ని విన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, తంబళ్లపల్లి శంకర్ యాదవ్, గాంధీ, నగరి, పూతలపట్టు ఇన్చార్జులు గాలి భానుప్రకాష్, మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు భీమనేని చిట్టిబాబునాయుడు, సీఆర్ రాజన్, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, హరిబాబు నాయుడు, శ్రీధర్‌యాదవ్, దేవపల్లి ధనంజయ నాయుడు, రాంబాబురెడ్డి, కార్జాల అరుణ, వెంకటేశ్, లోకనాధ నాయుడు, గురజాల జగన్మోహన్, ఈశ్వర్‌ప్రసాద్, దేవసుందరం, కామసాని కోదండరెడ్డి, నియాజ్ అలి, విజయ్‌కుమార్‌రెడ్డి, కేతినేని లోకేశ్‌నాయుడు, బాలాజీ నాయుడు, వ్యాపారవేత్త చల్లగుండ్ల దీపక్ నాయుడు, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, రుద్రయ్యనాయుడు, జయశంకర్ నాయుడు, చెంగళరాయయాదవ్, లోకనాధరెడ్డి, రాజేంద్రన్, సుబ్రమణ్యం, పుష్పరాజ్, మన్నారయ్య, జ్యోతియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల జగన్మోహన్

చిత్తూరు, ఫిబ్రవరి 6: జీడీనెల్లూరులో చంద్రబాబు నిర్వహించిన రా.. కదిలిరా సభకు వెళ్లిన పదివేల మంది నియోజకవర్గ ప్రజలకు టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఠాణా వద్ద ఉన్న ఓ ఫ్యాక్టరీ ఆవరణలో టీడీపీ నేతలతో పాటు గురజాల జగన్మోహన్ వడ్డించారు. అలాగే హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సీపీఎస్‌ను రద్దు పరచాలి: యూటీఎఫ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని మంగళవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు ఓట్ ఫార్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ పాత పింఛన్‌ను సాధించడానికి అన్ని సంఘాలతో కలసి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో తక్షణం సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎవరైతే సీపీఎస్‌ను రద్దు చేసి తమకు పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని తెలియజేస్తారో వారికే తమ ఓటు వేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ నాయుడు, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు శాంతకుమారి, సురేంద్రబాబు, సురేష్, గీత, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూతగాదా కేసులో ఒకరికి జైలుశిక్ష, జరిమానా



శిక్ష పడిన వెంకటేష్‌తో పోలీసు కానిస్టేబుల్

నగరి, ఫిబ్రవరి 6: నగరి మండల పరిధిలోని ముడిపల్లి పంచాయతీలోని రామాపురంలో 2020లో జరిగిన భూతగాదా కేసులో ఆర్.వెంకటేష్‌కు(49) రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష, రూ.3500 జరిమానా విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ నవీన్ తెలిపారు. ఐపీసీ సెక్షన్ 324, 326 కింద కేసు నమోదు చేయగా, మంగళవారం నగరి కోర్టులో న్యాయమూర్తి విష్ణువర్మ ఈ మేరకు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

దుకాణ దారులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 6: దుకాణ దారులు తప్పని సరిగారిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకారరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1988 దుకాణం, సంస్థల చట్ట ప్రకారం సొంత వ్యాపారం కలిగిన దుకాణలు, సంస్థలు, హోటళ్లు, సినిమా హాళ్లు అందరు విధిగా జిల్లా కార్మిక శాఖ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను తప్పని సరిగా పొంది ఉండాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఈ నెల 29వ తేది లోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం సహాయ కార్మిక శాఖ అధికారి జగదీష్‌బాబు మాట్లాడుతూ గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తప్పకుండా చేయించుకోవాలని, లేదంటే తనిఖీ చేసినప్పుడు రిజిస్ట్రేషన్ లేకుండా, రెన్యూవల్ లేకుండా దొరికితే కార్మిక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు పెనుమూరులో విద్యుత్ అదాలత్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 6: పెనుమూరు సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్ డివిజన్ ఈఈ పద్మనాభపిళ్లై ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులకు పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదాలత్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి పాల్గొంటారన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

పూతలపట్టు, ఫిబ్రవరి 6: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం ఆమె మండలంలోని పోలవరం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను కలిశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరుప్రఖ్యాతలు తేవాలన్నారు. అనంతరం పి. కొత్తకోట సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. ఎంపీడీవో గౌరి తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ క్రీడాకారిణికి ప్రభుత్వ ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఆర్డీవో చిన్నయ్య తదితరులు

కార్వేటినగరం/చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 6: జీడీ నెల్లూరులో జరిగిన నియోజకవర్గం స్థాయి కబడ్డీ పోటీల్లో గాయపడ్డ కార్వేటినగరం మండలం డీఎం పురం గ్రామానికి చెందిన మునెమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టర్ షన్మోహన్ ఆదేశాలమేరకు రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు మంగళవారం అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, కార్వేటినగరం ఎంపీడీవో మోహనమురళి, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంఈవోలు విజయ్‌కుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద మంగళవారం గిరీష్ జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. జయచంద్ర నాయుడు, ఎన్‌పీ నవీన్ చౌదరి, ఎన్‌పీ విక్రమ్, రామభద్ర నాయుడు, లోకనాథ నాయుడు పాల్గొన్నారు.

గుడిపాల: గుడిపాల అన్నా క్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లి రవి నాయుడు భోజనం వితరణ చేశారు. వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి జయదేవ నాయుడు, హరిబాబు, జనసేన నాయకుడు రమేష్, టీడీపీ మండల కార్యదర్శి కిట్టు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు అండగా ఉంటా
- చంద్రబాబు



చంద్రబాబును కలిసిన టీడీపీ జిల్లా మైనారిటీ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 6: మైనారిటీలకు అండగా ఉంటానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చినట్లు పార్టీ జిల్లా మైనారిటీ నాయకులు తెలిపారు. జీడీనెల్లూరు రా.. కదలిరా కార్యక్రమంలో టీడీపీ జిల్లా మైనారిటీ నాయకులు చంద్రబాబును కలిశారు. వారు మాట్లాడుతూ గతంలో మైనారిటీల కోసం అమలు పరిచిన దుల్హన్ పథకం, విదేశీ విద్య లాంటి పథకాలు అమలు పరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ ఉమర్, పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు కాజా పీర్, షాహిర్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన మాజీ మేయర్

చిత్తూరు, ఫిబ్రవరి 6: జీడీ నెల్లూరులో మంగళవారం జరిగిన రా.. కదిలిరా సభకు విచ్చేసిన చంద్రబాబును చిత్తూరు మాజీ మేయర్ కఠారి హేమలత, దివంగత కఠారి మోహన్ కుమార్తె లావణ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు వారు పుష్పగుచ్ఛం అందించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని కఠారి హేమలత తెలిపారు.









రా.. కదిలిరా సభకు తరలివెళ్లిన నగరి తెలుగు తమ్ముళ్లు, రామానుజ చలపతి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, పూతలపట్టులో ర్యాలీని ప్రారంభిస్తున్న దొరబాబు, గోపి, నింద్ర నుంచి వెళ్లిన టీడీపీ నేతలు

'రా...కదలిరా'కు భారీగా తరలిన జనం



మహారాజపురం నుంచి బయలుదేరిన టీడీపీ నేతలు



గుడిపాలలో ర్యాలీగా వెళ్తున్న టీడీపీ నాయకులు

నగరి, ఫిబ్రవరి 6: జీడీనెల్లూరు మండలం రామానాయుడుపల్లి వద్ద మంగళవారం జరిగిన రా.. కదలిరా బహిరంగసభకు పలు మండలాల నుంచి జనం భారీగా తరలివెళ్లారు. నగరి పట్టణం, మండల పరిధి నుంచి రా.. కదిలిరా కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్లు, మహిళలు భారీగా తరలివెళ్లారు.నగరి మండల పరిధిలోని 21 పంచాయతీల నుంచి, పట్టణ పరిధిలో 29వార్డుల నుంచి బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. నగరి పట్టణ పరిధిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంటరీ అధికారప్రతినిధి చినబాబు, నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతి నాయుడు, గుణశేఖర్‌ల ఆధ్వర్యంలో, మండల పరిధిలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి కార్యదర్శి పురుషోత్తం నాయుడు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు భారీగా చంద్రబాబు కార్యక్రమానికి తరలివెళ్లారు.

రామానుజం చలపతి ఆధ్వర్యంలో...

నగరి పట్టణ పరిధిలోని 1, 3వ వార్డుల నుంచి రామానుజం చలపతి మాజీ కౌన్సిలర్ లతల ఆధ్వర్యంలో పసుపు దుస్తులతో టీడీపీ జెండాలతో రా...కదలిరా కార్యక్రమానికి తరలి వెళ్లారు. వినూత్న రీతిలో చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రత్యేకంగా 200 మంది పసుపు దుస్తులు ధరించి టీడీపీ జెండాలతో వరుసగా నిలవడం ఆకర్షణగా నిలిచింది.

విజయపురం: మండలంలోని 25 పంచాయతీల నుంచి బస్సులు, కార్లు, వ్యాన్‌లు, క్యాబ్‌ల్లో సుమారు 2500 మంది తరలివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, ధనుంజయయాదవ్, దశరథరాజు, పురుషోత్తం, సుధాకర్‌రాజు, రవిరాజు, ఏళుమలై, అశోక్, శరత్, రఘునాథరెడ్డి, శివలింగం, మురళీ, గుణభూషణమ్మ, బాబు, సెల్వం, జయరాజ్, ఉదయకుమార్, ఆర్ముగంరెడ్డి, రవిచంద్రారెడ్డి, బాలాజీ నాయుడు, ధామునాయుడు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని 27 పంచాయతీల నుంచి సుమారు 35 బస్సుల్లో జనసమీకరణ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో గుడిపాలలో ర్యాలీ నిర్వహించి, జనాన్ని తరలించారు. టీడీపీ నాయకులు అనిల్ కుమార్, శంకర్ చౌదరి, బాలసుబ్రహ్మణ్యం, జయదేవ నాయుడు, ఆనంద్ యాదవ్, కుమార్, జయచంద్ర, రాజ, ఐజాక్, శ్రీకర్, గోపి, సాంబశివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ సొంత మండలం కార్వేటినగరం కావడంతో ఎక్కువ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కృష్ణాపురం క్రాస్ రోడ్డు వద్ద కేఎం పురం మాజీ సర్పంచ్ సోమశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సభకు కార్యకర్తలు తరలి వెళ్లారు.

నింద్ర: మండలం నుంచి వెయ్యి మంది కార్యకర్తలు బస్సుల్లో, కార్లలో తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు రవి నాయుడు, చిట్టిబాబు, బాబుయాదవ్, గాలి రమేష్ నాయుడు, మురళీనాయుడు, మనోజ్‌యాదవ్, ప్రసాద్ రెడ్డి, లోకేష్, మనోహర్ నాయుడు, పెరుమాల్ రెడ్డి, పరదేశి, దొరస్వామి నాయుడు, ప్రకాష్ వెంకటేష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల అధ్యక్షులు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో 130 సుమోలు, 15 బస్సులు, మోటారు సైకిళ్లతో భారీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నేతలు జయచంద్ర నాయుడు, ధరణీ నాయుడు, ఎన్‌పీ విక్రమ్, జనార్ధన్ గౌడ్, కమలనాథరెడ్డి, హేమచంద్రనాయుడు, నీవన్ చౌదరిలు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని 13 పంచాయతీల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, బస్సులు, టాటా సుమోల్లో పెద్దఎత్తున పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, జె. విజయ్‌కుమార్, మణి నాయుడు, బుజ్జి నాయుడు, అరుణ్‌నాథన్, సాంబశివన్, చిన్నబ్బ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మూలూరు గ్రామం నుంచి సుమారు 200మంది టీడీపీ నాయకులు, మహిళలు తరలి వెళ్లారు. టీడీపీ బీసీ సంఘం మండల అధ్యక్షుడు దొడ్డ హేమాద్రి యాదవ్, సోమేశ్వర్‌రెడ్డి, నీరంజన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలం నుంచి వేలాది మంది కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని నలుమూలల నుంచి వచ్చిన వాహనాలను అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆపి, వాహన ర్యాలీని మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళిలు జెండాఊపి ప్రారంభించారు. సుమారు 200 కార్లు, 20 బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. నాయకులు కాంతారావు, హేమాద్రి నాయుడు, గణపతి నాయుడు, చిరంజీవి, ప్రమోద్, దేవరాజులు నాయుడు, గోవర్ధన్, దాము, కార్తికేయ చౌదరి, బాలక్రిష్ణమ నాయుడు, ఇంద్రసేన నాయుడు, రెడ్డప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి: ఆరుగురి అరెస్టు

చిత్తూరు, ఫిబ్రవరి 6: నిబంధనలకు విరుద్ధంగా కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు... మంగళవారం నగరంలోని గొడుగుమూరులో కోడిపందేలు ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది దాడి చేసి ఆరుగురుని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6వేల నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

పూతలపట్టు ఎంపీడీవోగా ప్రసన్నకుమారి

పూతలపట్టు, ఫిబ్రవరి 6: పూతలపట్టు ఎంపీడీవోగా ప్రసన్నకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా ఉన్న గౌరి జిల్లా పరిషత్ కార్యాలయంలో రిపోర్ట్ చేయగా, ఆమె స్థానంలో టెక్కలి మండలం ఎంపీడీవోగా వున్న ప్రసన్నకుమారి ఇక్కడికి వచ్చారు.

యాదమరి ఎంపీడీవోగా సింగయ్య

యాదమరి, ఫిబ్రవరి 6: యాదమరి ఎంపీడీవోగా సింగయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఎంపీడీవోను పలువురు అధికారులు కలిసి పుష్పగుచ్చాలందించి స్వాగతం పలికారు.

విజయపురం ఎంపీడీవోగా బ్రహ్మయ్య

విజయపురం, ఫిబ్రవరి 6: ఎంపీడీవోగా బ్రహ్మయ్య మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా కొండాపురంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై విజయపురం వచ్చారు. ఇక్కడి ఎంపీడీవో చంద్రమౌళి సూళ్లూరుపేటకు బదిలీపై వెళ్లారు.

పెనుమూరు ఎంపీడీవోగా

పెనుమూరు, ఫిబ్రవరి 6: పెనుమూరు ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నీలకంఠేశ్వర్‌రెడ్డిని నెల్లూరు జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో గూడూరు నుంచి వెంకటేశ్వరరావు వచ్చారు.

దేవుడి సొమ్ముతో దొరికిపోయిన దొంగ



పట్టుబడిన ఆభరణాలతో దొంగను చూపుతున్న ఐరాల పోలీసులు

ఐరాల, ఫిబ్రవరి 6: ఆలయంలో చోరీ చేసిన ఆభరణాలతో పారిపోవడానికి సిద్ధంగా ఉన్న దొంగను ఐరాల ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మంగళవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్‌ఐ కథనం మేరకు పాకాల మండలం ఫకీరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం ఐరాల మండలంలోని పొలకల సమీపంలోని దండు మారియమ్మ ఆలయంలో ఈనెల 2వతేదీన చోరీ చేశాడు. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు ఐరాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడు వెండి ఆభరణాలను గతంలో తనకు జైలులో పరిచయమైన పా తనేరస్తులు రాయచోటికి చెందిన శివకుమార్, చిన్న సహకారంతో చిత్తూరులో విక్రయించడానికి వెళుతుండగా, అతడిని పాటూరుసంతగేటువద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి వెండిగొడుగు, శిరస్సు, బిందె, వడ్డాణాన్ని స్వాధీనపరచుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్తిస్థాయి ఫలితాలపై అవగాహన పెంచాలి:డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 6: పాఠశాలల్లో విద్యార్థులు పూర్తి స్థాయి ఫలితాలు సాధించడంపై క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు దృష్టి సారించాలని డీఈవో విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం పలు అంశాలపై బాలాజీ కాలనీలోని సమావేశ మందిరంలో విద్యా వ్యవస్థ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి సీఆర్‌పీ పరిధిలోని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణ సాధించేలా చూడాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అన్ని పాఠశాలల్లో సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్టు కార్యక్రమం అమలవుతున్న పాఠశాలలను ఎంఈవోలు, డీవైఈవో తప్పక పర్యవేక్షించాలన్నారు. యూడైస్ వెంటనే పూర్తి చేసిన 8వ తరగతి విద్యారులకు ట్యాబ్ అందజేసి, సజావుగా పనిచేస్తుందా లేదాని నిర్ధారించుకోవాలన్నారు. సమావేశంలో జీసీడీవో ప్రంశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జయప్రకాష్, అలెస్కో అధికారి అజయ్‌కుమార్, ఏఎంవో పల్లవి, ఏసీహెచ్ఓ ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

చిత్తూరు, ఫిబ్రవరి 6: సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండం డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ బాడుగకు గోడౌన్‌లు తీసుకుని అధికంగా అద్దెలు చెల్లిస్తున్నారన్నారు. గతంలో అనేకసార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి నెలా 5వ తేదిలోపు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ మోహన్‌బాబుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు అయ్యప్ప, దాసరి చంద్ర, రమాదేవి, రఘు, కృష్ణ, శంకర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సాధన గోడపత్రికల ఆవిష్కరణ

చిత్తూరు, ఫిబ్రవరి 6: బహుజన పార్టీ రాజ్యాధికార సాధన గోడపత్రికలను ఆ పార్టీ నేతలు మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. చిత్తూరు పార్లమెంటు బీఎస్పీ అభ్యర్థి తొగురు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కుటుంబాల పాలన పోవాలని, బహుజన రాజ్యాధికార పాలన రావాలని కోరారు. రాష్ట్రంలో అత్యధిక శాతం కలిగిన ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల వారిని ఈ ప్రభుత్వాలు మరిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ విజయమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జులు శివాడి గోవిందు, సంగీతం సిద్ధయ్యమూర్తి, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నేతలు

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

చిత్తూరు, ఫిబ్రవరి 6: జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి మంగళవారం పలు వసతి గృహాలను తనిఖీ చేశారు. నగరి బాలికలు, బాలుర వసతి గృహాలను తనిఖీ చేసిన అనంతరం రికార్డులను పరిశీలించారు. అలాగే త్వరలో టెన్త్ పరీక్షలు సమీపిస్తున్నందున వసతి గృహాలలో జరుగుతున్న ప్రేరణ తరగతులను పరిశీలించి విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం కార్వేటినగరం వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ ఆలయ కుంభాభిషేకం



దేశమ్మకు పూజలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో మంత్రి రోజా

నగరి, ఫిబ్రవరి 6: నగరి పట్టణంలోని టీఆర్‌కండ్రిగలో గల దేశమ్మ ఆలయ కుంభాభిషేకం రెండవ రోజు మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 8గంటలకు దీక్షా ప్రకరణం, యాగశాల సంస్కారం, మహాధ్వజ స్థాపనం, అఖండదీప ప్రజ్వలనం నిర్వహించారు. అనంతరం దేశమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మంత్రి రోజా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ వేణుబాబు కమిటీ సభ్యులకు, భక్తులకు కంకణాలు కట్టించారు.

బంగారుపాళ్యం తహసీల్దార్‌గా సుభద్రమ్మ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6: బంగారుపాళ్యం తహసీల్దార్‌గా సుభద్రమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈమె నంద్యాల జిల్లా చాగలమర్రినుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయండి

పాలసముద్రం, ఫిబ్రవరి 6: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9వ తేది శుక్రవారం అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని డాక్టర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2-19 ఏళ్ల మధ్య వయస్సున్న వారందరికీ మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, లక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

నింద్ర, ఫిబ్రవరి 6: ఓటుహక్కుపై మహిళా సంఘ సభ్యులు మంగళవారం ఆగరం, ఎలకాటూరు తదితర గ్రామ పంచాయతీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు నమోదు, ఓటు వేయడం తదితర అంశాలపై మహిళా సంఘ సభ్యులకు, ప్రజలకు వెలుగు ఏపీఎం చంద్రకళ అవగాహన కల్పించారు. సీసీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుడిపాల: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై మంగళవారం చీలాపల్లి పంచాయతీలో వెలుగు సమాఖ్య ద్వారా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లోకనాధరెడ్డి, సంఘమిత్రలు పాల్గొన్నారు.